

గంజాయి సాగు చేస్తే చర్యలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: నుర్మతి అవుట్ పోస్ట్ సరిహద్దుల గ్రామాలలో బుధవారం స్థానిక సిఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్ పర్యటించారు. పలు అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాలలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదని సూచించారు. గంజాయి సాగు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సారా వంటి విక్రయాలను మానుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ సమస్యలు పరిష్కారం చేసే విధంగా చూస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న సిఐ





పాడేరు, చింతూరులో ఆందోళనలు చేపడుతున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని..

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి జీతభత్యాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు లోని అంబేద్కర్ సెంటర్ నుండి ఆర్.టి.సి. కాంప్లెక్స్ వరకు యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కొనసాగింది. ఈ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతభత్యాలు ప్రతి నెల 1వ తేదీన చెల్లించాలని, పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, పార్ట్ ఫైనల్, సరెండర్ లీవులు విడుదల చేయాలని, డిఎ బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. ఐటీడీఏ వద్దకు ర్యాలీగా చేరుకున్న ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శనతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తాలూకా కేంద్రాల్లోనూ నిరసనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం చాలా విచారకరమని తెలిపారు. దీంతో, మళ్ళీ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిలో నిరసన చేపట్టడం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో ప్రభుత్వం స్నేహ పూర్వక సంబంధాలు కలిగి ఉందని చెబుతూ మోసం చేస్తోందని విమర్శించారు. సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నేతలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, 5 నెలలు గడిచినా మీన మేషాలు లెక్కిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి జీతభత్యాలు చెల్లించకుంటే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి యం.ధర్మారావు, పి.దేముడు, ఆడిట్ కమిటీ సభ్యులు కె.రఘునాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళారావు, గంగాధర్, కర్రి బాబు, ఎస్ కన్నయ్య, రాజారావు, బాలకృష్ణ, ఆనంద్, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చింతూరు తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిపడిన ఏపీజిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవ్స్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జనవరి 28న రాజమండ్రిలో జరిగే పాత పెన్షన్ సాధన సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొగ్గ ముత్తయ్య, ఎం.సోమరాజు, ఎన్ జగదీష్, ఎం రామకృష్ణ, పి రాజారావు, ఎం విజయ, కళ్యాణి, అప్పారావు, బ్రహ్మయ్య, నాగయ్య, బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా ఎన్నికల కమిషన్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ కేటగిరి కింద ఉత్తమ ప్రాక్టీసెస్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అత్యధిక మంది పివిటిజిలకు (18,012) ఓటర్లుగా నమోదు చేయించినందుకు గాను ఎన్నికల కమిషన్ ఈ అవార్డును ప్రకటించింది.జి.మాడుగుల మండలం 25వ నంబర్ పోలింగ్ కేంద్రం బి.ఎల్.ఓ ఉత్తమ బి.ఎల్.ఓ గా ఎంపికయ్యారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని విజయవాడ ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేస్తారు.



గంజాయి సాగు చేపట్టొద్దు

- ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - చింతపల్లి: శీతల వాతావరణం అన్ని రకాల పంటల సాగుకు అనుకూలమని, ఈ విషయాన్ని ప్రతి రైతు గ్రహించి అక్రమ వ్యాపారం గంజాయి సాగు జోలికి పోవద్దని చింతపల్లి ఏ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం వద్ద కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాగులు, వీరవరం గ్రామాలకు చెందిన గిరి రైతులకు పలు రకాల పంటలపై అవగాహన కల్పించారు. అల్లూరి జిల్లాలో గిరిరైతులు సీజనల్ పంటలు పండించేందుకు అనువైన వాతావరణం ఉందని, బీసీటీ ద్వారా పలు రకాల పంటలపై పరిశోధనలు చేస్తున్నారన్నారు. రాయితీపై పసుపు, మిరియాలు పొడి చేసే యంత్రాలను, చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు. రాజ్మా పంట దెబ్బతింటుందని, పూల సాగు, పండ్లు మొక్కలు తదితర పంటలు ఏలా సాగు చేసుకోవాలని పలువురు రైతులు శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ ఛైర్మెన్ శ్రీరామూర్తి, శాస్త్రవేత్త ప్రసాదరావు, ఎల్డీఎం రవితేజ, గూడెంకొత్తవీధి, చింతపల్లి సీఐలు అశోక్ కుమార్, రమేష్, ఎస్సై అరుణకిరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్


మాట్లాడుతున్న చంద్రశేఖర్

మూగజీవాల పట్ల ప్రేమతో మెలగాలి

-పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖర్

ప్రజాశక్తి - చింతపల్లి : జంతువుల సంక్షేమం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పి చంద్రశేఖర్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి 30వ తారీకు వరకు నిర్వహిస్తున్న జంతుసంక్షేమ పక్షోత్సవాల కార్యక్రమాన్ని చింతపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు పి. చంద్ర శేఖర్ చింతపల్లి ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలలో పెంపుడు కుక్కలు, ఇంటిదగ్గర పెంచుకునే ఆవులు, గేదెలు మేకలు, గొర్రెలు. కోళ్లను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జంతువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించేవారికి జంతు సంక్షేమ సంస్థ అధికారి ద్వారా వర్తించే శిక్షలు, జరిమానాలను వివరించారు. కుక్క కాటుతో సంక్రమించే రాబిస్ వంటి వ్యాధులకు సంబంధించి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గహ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామరాజు పడాల్, వసతి గహ అధికారి సాంబశివరావు, పశు వైద్య సిబ్బంది అప్పారావు నాయుడు, లక్ష్మి, సతీష్ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


జాయినింగ్ లేఖలు అందజేస్తున్న అంగన్వాడీలు

విధుల్లో చేరిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

43 రోజుల పాటు నిరవధిక సమ్మె చేసి, పలు డిమాండ్లు సాధించుకొని, సమ్మె విరమించిన అంగన్వాడీలు బుధవారం విధుల్లో చేరారు. ఈ మేరకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ్‌కి విధుల్లో చేరుతున్నట్లు జాయినింగ్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎన్.రత్నకుమారి, డి.ప్రసూన, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు

జిఒ 3ను పునరుద్ధరించాలి

- ఉపాధ్యాయ సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-రంపచోడవరం

జిఒ నెంబర్‌ను 3ను తక్షణమే పునరుద్ధరించాలని ఎపిటిడబ్ల్యుటియు, ఎస్‌టిఎఫ్, యుటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరుణ విలాస్, కె.ఆదిరెడ్డి, కె.సూరిబాబు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతాలలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గిరిజన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మూలంగా గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు విద్యను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆనాడు ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయడం జరిగేదని తెలిపారు. కాని నేడు జిఒ 3 రద్దు చేయడంతో షెడ్యూల్ ప్రాంతంలో రాబోయే కాలంలో గిరిజనులకు విద్య అందని ద్రాక్షలా మిగిలే ప్రమాదం ఉందని, కావున జీవో నెంబర్ 3ను పునరుద్ధరించి దానికి అనుగుణంగా ప్రమోషన్లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిడబ్ల్యుటియు నాయకులు బి.మంగిరెడ్డి, వైయస్సార్‌పీఎఫ్ నాయకులు సిహెచ్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టు వాహనదారులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న టూరిస్టు వాహన దారులపై పోలీసులు దృష్టి పెట్టాలని బోయితేలి సర్పంచ్ మాలన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జి.మాడుగుల, పాడేరు మధ్య కె కోడపల్లి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వంజరి పంచాయితీ గొప్పల పాలెం గ్రామానికి చెందిన జగ్గం దొర అర్జును అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఇలాంటి సంఘటనలు అధిక సంఖ్యలో టూరిస్టులతోనే జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే ఇలాంటి సంఘటన చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. పోలీసులు దృష్టి పెట్టి కఠిన ఆంక్షలు విధించాలని, మునుముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

జాతీయ రహదారి గోతులమయం

- మలుపుల వద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- తరచూ ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని యర్రంపేట నుండి ఒడిశా రాష్ట్రానికి వెళ్ళే జాతీయ రహదారిపై ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి తోడు మండలంలోని కల్లేరు మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేక పోవటంతో ఒడిశా నుండి వచ్చే భారీ వాహనాలు మలుపు వద్ద అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. గత సంవత్సరం ఆంధ్రా నుండి ఒడిశాకు వెళ్ళి వచ్చే క్రమంలో కల్లేరు మలుపు వద్ద కారు ప్రమాదానికి గురై ఇద్దరు ఉపాధ్యాయులు మృత్యువాత పడ్డారు. యర్రంపేట మలుపు వద్ద రోడ్డు లేయర్ లేచి పోవటంతో దుమ్ము ధూళి, పొగమంచుగా ఏర్పడి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పైకి లేచే దుమ్ము ప్రభావంతో చుట్టు పక్కల నివాసాలు ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. కొందరు నివాసాలు ఖాళీ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రహదారి వారోత్సవాలు మాత్రమే కాకుండా రహదారుల మరమ్మతులు కూడా చేపట్టాలని పలువురు కోరుతున్నారు. తక్షణమే ప్రమాదకర గోతులను పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డు పాడైన యర్రంపేట ములపు వద్ద మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఒడిశాకు వెళ్లే జాతీయ రహదారి మధ్యలో ఉన్న గోతులు


జమాల్ ఖాన్‌ను కలిసిన సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్

జమాల్ ఖాన్ ఆశ్రమంలో ఆర్‌పి.పట్నాయక్

ప్రజాశక్తి-చింతూరు

ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా, మోటు తాలూక, మారుమూల ప్రాంతం ఇస్మాయిల్ నగర్‌లోని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఆశ్రమానికి ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్ బుధవారం విచ్చేశారు. ఆశ్రమంలో పెద్ద సంఖ్యలో వచ్చిన రోగులతో పాటే పట్నాయక్ కూడా జమాల్ ఖాన్‌ను కలిశారు. జమాల్ ఖాన్‌కు ఆర్‌పి.పట్నాయక్ గురించి సరిగా తెలియకపోవడంతో మామూలుగా వచ్చే పేషెంట్లు మాదిరిగానే తొలుత పలకరించారు. తరువాత అసలు విషయం తెలుసుకొని పట్నాయక్‌ను సాదరంగా ఆహ్వానించి ఆయన సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. 'మీరు రాగాలతో రోగాలను నయం చేస్తారు.., నేను ఆయుర్వేదంతో రోగులకు సేవ చేస్తున్నాను' అని చలోక్తులతో జమాల్ ఖాన్ అనడంతో ఇద్దరి మధ్య హాస్య సంభాషణ కొనసాగింది. జమాల్ ఖాన్ ఆయుర్వేద చికిత్స విధానాన్ని తెలుసుకొని వెతుక్కుంటూ ఈ మారుమూల ప్రాంతానికి ఆర్‌పి.పట్నాయక్ రావడం ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. .

బాల్య వివాహాలను వ్యతిరేకించండి

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట

బాల్య వివాహాలను విద్యార్థినులు వ్యతిరేకించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సూచించారు. స్థానిక ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడ పిల్లలు పాఠశాలలకు వెళ్లి ఉన్నతంగా చదువుకుని ఎదగాలని చెప్పారు. ఆడ పిల్లలకు బ్యాడ్, గుడ్ టచ్‌పై అవగాహన ఉండాలని అన్నారు. పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. రాగి జావను తాగడం అలవాటు చేసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాలలో మంచి పోషక విలువలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, పెద్దలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. భారత రాష్ట్రపతిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలను సొంతం చేసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు నేరమని, ఈ విధంగా చేస్తే ఐసిడిఎస్ అధికారులకు, సచివాలయం మహిళా పోలీసుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్యాధికారులు, అమెరికన్ ఇండో పౌండేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించిన జాతీయ బాలిక వారోత్సవాల ముగింపు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ జీ వి రమణి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఎంఈఓ పనసల ప్రసాద్, ట్రై కార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు, ఎస్ఐ అరుణ్ కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్‌రావు, వైకాపా మండల కన్వీనర్ పాంగి గుణబాబు మాట్లాడుతూ, బాలికలు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలన్నారు. చెడు సహవాసాలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి పోకుండా లక్ష్యాన్ని చేదించే దిశగా విద్యలో రాణించాలన్నారు. ఆకతాయిల వలలో పడి భవిష్యత్తును పాడు చేసుకోరాదని సూచించారు. కౌమార దశలో కలిగే కోరికల పట్ల కఠినత్వంగా ఉంటూ భవిష్యత్తును బంగారు బాట చేసుకోవాలన్నారు. నేటి బాలికలే రేపటి తరాలకు మార్గదర్శకులు కావాలని సూచించారు. విద్య ద్వారానే అన్ని సాధ్యమని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండలరావు, వసతి గీహ అధికారిని నూకరత్నం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ్ కుమారి, సత్యవతి, గౌహరున్నీషా, రామలక్ష్మి, అప్పలనరస, గౌరీ, రామలక్ష్మి, వైకాపా నాయకుడు సుందర్, మానవ హక్కుల సభ్యురాలు ప్రసన్న, అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి, రాశీ, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయునిలు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ఆడపిల్లలు అన్నింటిలోనూ రాణించాలి

విఆర్.పురం : ఆడపిల్లలు అన్నింటిలోనూ రాణించాలని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వెంకలక్ష్మి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాఠశాల నుండి విఆర్ పురం ఇందిరాగాంధీ సెంటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఎందులోనూ తక్కువ కాదని, తల్లిదండ్రులు బాలికలను బాగా చదివించాలని, ముఖ్యంగా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. అరాచక శక్తుల నుంచి మనకు మనమే కాపాడాలని సూచించారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు భారతి, సుబ్బమ్మ, శ్యామల, వరలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

మోసపూరిత హామీలతో పాలన

ప్రజాశక్తి - చింతపల్లి: ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టారని, రాబోవు సార్వత్రిక ఎన్నికలలో ఓటు అస్త్రంతో తరిమి కొట్టాలని తెదేపా మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు కోరారు. బుధవారం అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణంతో కలిసి అంతర్ల, పెంటపాడు తదితర గ్రామాలలో బాబు షూరిటీ...భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాడు ప్రతిపక్ష హోదాలో పాదయాత్ర చేసిన జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతి ఏడాది జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక నవ మోసాలు చేశారన్నారు. నిరుద్యోగ యువతకు మాయమాటలు చెప్పి మరో మారు అధికారం చేపట్టాలని చూస్తున్న వైకాపాను నమ్మి మోసపోవద్దని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, బేత నాగు, క్రొ గోవింద్, గొల్లూరి మంగు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సురభారతి సాంస్కృతిక సంస్థ ప్రతినిధి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యాన బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నగరానికి చెందిన గాయనీగాయకులు ఆంజనేయరెడ్డి, సాత్విక, శైలజ, శ్రీనివాస్, లావణ్య, రేణుక, సుజాత పలు పాటలపై గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సనమూర్తి మాట్లాడుతూ, విశాఖలో కళా సంస్థలు చేస్తున్న కృషి అజరామరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారావు, గంగాధర్, మధు, రాము, విజయరమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ ప్రవేశిక పుస్తకంతో విద్యార్థులు

బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని దాబాగార్డెన్స్‌లోని ఆర్‌ఓఎం యుపి స్కూల్లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హెచ్.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు కె.రాంబాబు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ జనరల్ జోన్ కన్వీనర్ ఎల్లాజి, సతీష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఈ పుస్తకం బాలల్లో తీసుకెళ్ళి వారికి రాజ్యాంగం పట్ల అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశమన్నారు. రాజ్యాంగంపై అవగాహన పెంచేందుకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ "ప్రతి హృదయంలో రాజ్యాంగం" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాల అడ్డగింత

ప్రజాశక్తి–హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఆమూరు గెడ్డ వద్ద జెసిబిలతో తవ్వి ఇసుకను తరలిస్తున్న వాహనాలను బుధవారం స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా నిలుపుదల చేయాలని స్థానిక గిరిజనులు అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంతో బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడగండి పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందించి అక్రమ ఇసుక నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరారు. కాంట్రాక్టర్లు, ఇసుక వ్యాపారుల అక్రమ దందాలతో గెడ్డలో ఇసుక, తవ్వడం నిల్వ చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేపడుతూ అక్రమార్కులు లక్షలు సంపాదిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. ఇదిలా ఉండగా మండలం నుండి ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. రహదారుల నిర్మాణాలకు ఇసుక అవసరం కావడంతో కాంట్రాక్టర్లు యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా వెంటనే నిలుపుదల చేయాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు.



వాహనాలను అడ్డగించి నిలదీస్తున్న గ్రామస్తులు

భూహక్కు పట్టాల పంపిణీ



పట్టాలు పొందిన లబ్ధిదారులతో సర్పంచ్ జ్యోతి

ప్రజాశక్తి- అరకులోయ: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా బుధవారం అరకులోయ మండలం మాడగడ గ్రామపంచాయతీ పకనగుడ గ్రామంలో 110మంది లబిద్దిదారులకు మాడగడ సర్పంచ్ మండ్య కేడ్డి జ్యోతి పట్టదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు తమ భూములను తాము సాగు చేస్తున్నప్పటికీ రెవిన్యూ రికార్డులో తప్పులు నమోదు కావడం, వేరే ఒకరి పేరు మీద నమోదవడం, తప్పులు దొర్లడం వంటివి చోటు చేసుకోవడంతో అటువంటి సమస్యలకు స్వస్తి పలకాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న శాశ్వత హక్కు పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో రైతు భూమి వద్దకు వచ్చి నిర్ణీత విస్తీర్ణం నిర్ధారించి తద్వారా శాశ్వత పట్టాలు మంజూరు చేయడం చాలా సంతోషదాయకమని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, క్రిమి సంహాక మందులు, వ్యవసాయక యాంత్రిక పని ముట్లు సకాలంలో అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, సర్వేయరు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బాలరాజు, వార్డు మెంబరు డేవిడ్, ధర్మరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంతలో తనిఖీలు

ప్రజాశక్తి–దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సంతలో లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్ పీడీవీ అప్పలరాజు ఆధ్వర్యాన అనకాపల్లి, గాజువాక ఇన్స్పెక్టర్లు బాస్కర రావు, ఉమాసుందరి, కమిషన్ ఏజెంట్లు కలిసి సంతలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయ, కిరణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, సీలు లేని వాటిని గుర్తించి కేసులు నమోదు చేశారు. గిరిరైతులు తీసుకొచ్చిన సరకులను దర్మకాటాపై తూకం వేసి సరి చూశారు. గిరిజన సంతల్లో తనిఖీలు నిర్వహించి గిరిజన రైతులను మోసస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఆనంతరం హుకుంపేట మండల పెదగరువులోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సందర్శించి తూకాల్లో మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు మోసాలపై పాల్పడకుండా ప్రతి వస్తువు కాటాపై తూకం వేసి సరకులను ఇవ్వాలని వ్యాపారస్తులకు సూచించడం జరిగిందిని తెలిపారు.



సంతలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సైబర్ నేరగాళ్లు, రుణ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి–విశాఖపట్టణం : సైబర్ నేరగాళ్లు, రుణ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పొరపాట్లు చేసి సైబర్ ఉచ్చులో పడొద్దని సిబిఐ విశాఖపట్టణం విభాగం ఎస్పీ మురళీ రంభ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించే నిమిత్తం సిఐడి విశాఖపట్టణం ఆర్వో ఆధ్వర్యంలో ఏయూలోని వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించే క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని, ఒటిపిలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుకోకుండా సైబర్ వలలో పడి చాలా మంది అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రుణ యాప్‌ల ఉచ్చులో పడి ఆర్థికంగా నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది భోగస్ కంపెనీల పేరుతో ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొన్ని బ్యాంకుల్లో, కార్యాలయాల్లో కింది స్థాయి సిబ్బందికి అధికారిక పాస్ వర్డులు చెప్పటం వల్ల కూడా ఆర్థిక మోసాలు జరుగుతున్నాయని ఎన్నో కేసుల విచారణలో ఇలాంటి విషయాలు వెలుగులోకి వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఎస్‌బిఐ డిజిఎం పంకజ్‌కుమార్, ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ స్టీఫెన్, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ మూర్తి నాయక్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐడి విశాఖపట్నం ఆర్వో అదనపు ఎస్పీ రవి వర్మ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలు ఆపి, సొంత గనులు కేటాయించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1028 రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడంతో అధిక ధరకు ముడి సరుకు కొనాల్సి వస్తుందన్నారు. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిని తగ్గించి నష్టాల్లోకి నెట్టి కార్మికులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ ప్రయత్నాలు మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి జివిఎల్ నరసింహారావు మోడీ ప్రభుత్వానికి దూతగా చాప కింద నీరులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా వెళతామని స్పష్టంచేశారు. దీక్షల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.శ్రావణ్, కె.కుమారి, శివ, వెంకటరావు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ధరను సవరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జిఒ 535లోని 60:40 నిష్పత్తి ద్వారా నిర్ణయించిన ధరను సవరించి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఉచితంగా లేదా నామ మాత్రపు రేటుకు కేటాయించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. విశాఖ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యత నిచ్చిన తర్వాతే స్టేట్ హెడ్ క్వార్టర్‌లో పనిచేస్తున్న వారిని పరిశీలించాలని కోరారు. 2023లో ప్రెస్ అక్రిడేషన్ లేనప్పటికీ గతంలో కలిగి ఉంటే వారికి స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతోనూ, ఆ తర్వాత మరణించిన జర్నలిస్టుల తరపున వారి కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో స్థానికులై గతసారి విశాఖలో ప్రెస్ అక్రిడేషన్ కలిగి సర్దుబాటులో భాగంగా 2023లో పాడేరు, అనకాపల్లి జిల్లాలలో ప్రెస్ అక్రిడేషన్ కలిగి ఉంటే వారికీ విశాఖ జిల్లాలో స్థలాలు కేటాయించాలన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. విశాఖ జిల్లా వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పి.సత్యనారాయణ, కె.చంద్రమోహన్, ఆర్.అబ్బాస్, బందరు శివప్రసాద్, బిఎ.నాయుడు, వి.శ్రీధర్, ఎం.శ్రీహరి, ఎస్.మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రాన్ని అందజేశారు.

సమాజంలో అందరికీ సమానావకాశాలు

- గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్



మాట్లాడుతున్న గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : సమాజంలో అందరికి సమానావకాశాలు లభించినప్పుడు దేశ ప్రజాస్వామ్యం మరింతగా బలోపేతం అవుతుందని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన సంవాద్ ప్రారంభోత్సవంలో 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం' అనే అంశంపై సదస్సులో మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రాజకీయ నాయకలపై ఉందన్నారు. రాజకీయ వ్యవస్థలో ఉన్నత ఆశయాలు గల వ్యక్తుల సమూహం పెరిగినప్పుడే సమాజంలో మార్పు, ముఖ్యంగా రాజ్యాంగబద్ధంగా దేశం పురోభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకులు ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో పాటు, ఆ నమ్మకాన్ని సడలనీయకుండా వ్యవహరించాలన్నారు. సమాజంలో మార్పును కోరుకునే వ్యక్తిగా తాను రాజకీయాలలోకి ప్రవేశించినట్లు శ్రీభరత్ వెల్లడించారు. ప్రజావాణిని చట్ట సభలలో వినిపించాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బండి కామయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డైరక్టర్ ప్రొఫెసర్ చిన్నయ్యసూరి మాట్లాడుతూ, భారతదేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉన్నతిని, కాలానుగుణంగా వస్తున్న మార్పులను వివరించారు. అలాగే సంవాద్ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని తెలిపారు.

వైసిపి ద్వంద్వ వైఖరిని గ్రహించాలి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, నిర్వాసిత కార్మికులకు న్యాయం చేసే విషయంలో స్వార్థపూరిత రాజకీయాలు చేస్తున్న వైసిపి ద్వంద్వ వైఖరిని ఉక్కు కార్మికులు గ్రహించాలని టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెదగంట్యాడలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యమిస్తున్న కార్మికులకు సంఘీభావంగా మూడేళ్ల క్రితం టిడిపి మాజీమంత్రి గంటాశ్రీనివాసరావు రాజీనామా చేస్తే, ఆనాడు దానిని ఆమోదించకుండా, త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఇప్పుడు రాజీనామా ఆమోదించారన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని తనపై ఉన్న కేసుల మాఫీకి కేంద్రానికి తాకట్టు పెట్టిన సిఎం జగన్‌రెడ్డి, ఇపుడు గంటా రాజీనామా ఆమోదంతో వైసిపి నిజ స్వరూపాన్ని బయటపెట్టారన్నారు.కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ టిడిపి సమన్వకర్త ప్రసాదుల శ్రీనివాస్. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి రమణారెడ్డి, వార్డు అధ్యక్షులు. నమ్మి అప్పారావు. సీతానగరం మాజీ సర్పంచ్ నక్క సింహాచలం. టిఎన్‌టియుసి నేత నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.

సర్వమతాల ఐక్యతతో శాంతిస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : సర్వమతాల ఐక్యతతో శాంతి స్థాపన సాధ్యమనిగాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య వి బాలమోహన్‌దాస్‌అన్నారు. బుధవారం డాక్టర్ ఎల్‌బి కాలేజ్ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో గాంధీ సెంటర్, బివి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో 'గాంధీ మత సామరస్యం' అంశంపై సెమినార్ నిర్వహించారు. హైదరాబాద్ విజయ విహారం ఎడిటర్ రమణ మూర్తి మాట్లాడుతూ కలసి జీవించడం భారత వారసత్వ మన్నారు. గాంధీ బోధనలకు తగిన ప్రాధాన్యత లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. సమావేశం లో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు. డాక్టర్ రావిప్రోలు సుబ్రమణ్యంశాస్త్రి పాల్గొన్నారు. రమణమూర్తి రాసిన పుస్తకాలను ప్రదర్శించి, అందరికీ ఉచితంగా అందజేశారు. సభికులతో శాంతి ప్రతిజ్ఞ చేశారు. శాంతి సందేశంతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు.

ఐకెఎస్ హెల్త్ సంస్థతో గీతం ఎంఒయు

ప్రజాశక్తి -మధురవాడ : ఆరోగ్య సేవారంగంలో పేరొందిన అమెరికన్ ఐకెఎస్ హెల్త్ కేర్ సంస్థ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఐకెఎస్ హెల్త్ కేర్ సంస్థ ఉపాధ్యక్షురాలు డాక్టర్ హరిప్రీత్‌కౌర్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. రెండు సంస్థలు మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా వైద్యరంగంలో ముఖ్యంగా ఫిజియోథెరపి, దంతవైద్యం, పారామెడికల్ విభాగాలలో యువతకు మార్గదర్శకం చేయడంతోపాటు అమెరికన్ వైద్య నిపుణుల సూచనలు, సలహాలు అందిసూ వృత్తి నైపుణ్యాలను పెంచడంలో క్రియాశీల పాత్ర పోషిస్తారు. అలాగే సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం, విశ్వవిద్యాలయంలో పరిశోధకులకు మార్గదర్శకం వహించడం, గీతం అధ్యాపకులకువ వర్క్‌షాప్, సదస్సుల నిర్వహణలో సహకరించడం, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ బోధనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని, తద్వారా శాస్త్ర విజ్ఞానంలో దేశం గర్వించ తగ్గ అత్యున్నత పరిశోధనలను నిర్వహించాలనేది తమ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల, గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ ఉమాదేవి, ఫిజియోథెరపి డైరక్టర్ డాక్టర్ జి.రంగనాథ్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

గాజువాక వైసిపిలో గ్రూపుల గోల!

టిక్కెట్ కోసం ప్రయత్నాల్లో విజయనగరం బాట
పోటాపోటీగా బొత్స ఝాన్సీతో కలయిక



బొత్స ఝాన్సీని కలిసి గాజువాకలోని ఒక వర్గం వైసిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక వైసిపిలో గ్రూపు విభేధాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. తాజా, మాజీ సమన్వయకర్తలకు అనుకూలంగా ఉన్న గ్రూపులు పోటాపోటీగా బలప్రదర్శన చేస్తూ, గాజువాక టిక్కెట్‌కు ప్రయత్నాలను కొనసాగిస్తూ పట్టునిరూపించు కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే విశాఖ పార్లమెంటరీ స్థానం వైసిపి సమన్వయకర్తగా నియమితులైన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీరాణిని విజయనగరం వెళ్లి కలిసి వస్తున్నారు.
గాజువాక నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నెలరోజుల క్రితం వరకు కొనసాగారు. ఈ నేపథ్యంలో తనకే ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందన్నంతగా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. ఇంతలో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇచ్చేందుకు చేసిన సర్వే నివేదికలు, మారుతున్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు)ను వైసిపి అధిష్టానం నియమించి గ్రూపు విబేధాలకు తెరలేపింది. దీంతో గాజువాక వైసిపిలో బాహాటంగానే రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. సమన్వయకర్తల మార్పే తప్ప, ఎమ్మెల్యే టిక్కెట్లు కాదంటూ ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఎవరికివారే తమ సత్తాను చూపేందుకు యత్నిస్తున్నారు. ఇందులోభాగంగా మూడు రోజుల క్రితం 21నతాజా సమన్వయకర్త రామచంద్రరావు వర్గం విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని కలిసి వచ్చారు. ఇక బుధవారం తిప్పలు దేవన్‌రెడ్డి వర్గం విజయనగరం వెళ్లి ఆమెను కలిసి వచ్చారు.విశాఖ ఎంపీగా గెలవాలంటే తమ సహకారం ఉండాలని, అదే సమయంలో తమకు టిక్కెట్ వచ్చేలా చూడాలంటూ ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి సత్తిబాబుతో ఉన్న సన్నిహిత సంబంధాలతో తన కొడుకుకు టిక్కెట్ కోసం ఎమ్మెల్యే నాగిరెడ్డికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే చందుకు టిక్కెట్ కోసం మంత్రి అమర్నాథ్ చూస్తున్నట్లు సమాచారం ఇలా గాజువాకలోని వైసిపి గ్రూపులు విజయనగరం బాట పడుతూ, బలనిరూపణతోపాటు టిక్కెట్‌కోసం యత్నాలు సాగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎవరికి వారే లాబీయింగ్ ముమ్మరం చేస్తుండడంతో చివరకు ఎవరిది పైచేయి అవుతుందోనని పలువురు ఆసక్తి చూస్తుండగా, ఇదే సమయంలో ఒకరికి సీటిస్తే, రెండో వర్గం సహకరిస్తుందాయన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

టిడిపి హయాంలో బిసిలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలసలో టిడిపి జయహో బిసి కార్యక్రమాన్ని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేములవలసలో భారీబహిరంగ సభ అనంతరం పెద్దిపాలెం వెల్లంకి మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ, టిడిపి పాలనలో బిసిలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ నిర్వీర్యం చేశారన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యతను బిసిలంతా తమ భుజస్కందాలపై వేసుకోవాల్సిన అవసరం వచ్చిందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాసర్ల ప్రసాద్, మీసాల సత్యనారాయణ, గనిరెడ్డి రమేష్, తమ్మిన విజయకుమార్, బుద్ధ త్రినాథ్, ఎర్నాకుల జగదీశ్వరరావు, డొకర అప్పలనారాయణ, గొల్లగాని సన్యాసిరావు, దేవగుప్త రమేష్, అంగటి రాము, వానపల్లి సత్య, బొద్దాపు శ్రీనివాస, అప్పలనాయుడు పాల్గొన్నారు

రోగి ఇంటి వద్దకే నేత్ర వైద్యం

- వినూత్న సేవలకు ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి శ్రీకారం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చే దిశగా ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి మరో అడుగు ముందుకేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుబంధంగా ఇక నుంచి ఇంటి వద్దకే నేత్ర వైద్యసేవలు అందించేందుకు సిద్ధమైంది. గత ఏడాది స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సౌజన్యంతో హోంకేర్ నేత్ర పరీక్ష సేవలను ప్రముఖ సినీనటి శ్రీలీలతో ఆవిష్కరింపజేశారు.
ఆసుపత్రికి స్వయంగా రాలేని శారీరక ఇబ్బందులున్న వ్యక్తులు, వృద్ధులు, వికలాంగులకు నేత్ర వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో ఈ సేవలను ప్రారంభించామని,. ఆసుపత్రికి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారి. ఇంటి వద్దకే నిపుణులైన వైద్యసిబ్బంది వెళ్లి కంటి ఆరోగ్యసేవలు అందిస్తారన్నారు. శిక్షణ పొందిన విజన్ టెక్నీషియన్స్ లేదా ఆప్టోమెట్రిస్ట్ రోగికి సమగ్ర కంటి పరీక్షను నిర్వహించి, అవసరమైతే వీడియో కాల్‌లో నేత్రవైద్యనిపుణులను సంప్రదించి, దృష్టి పరీక్షలు, అధునాతన నేత్ర పరిశోధనలు నిర్వహిస్తారు. నేత్ర వైద్యుల సూచనల మేరకు ఆపరేషన్ అవసరమైతే రోగులను ఆసుపత్రికి తరలిస్తారు. కంటి రోగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వర్గాలు కోరాయి. మరింత సమాచారం కోసం 6302432118 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

యుజిసి నెట్ జాతీయ టాపర్‌కు అభినందన



అప్పలరాజును అభినందిస్తున్న సహచర ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -తగరపువలస : యుజిసి నెట్ 2023-24లో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన భీమిలి మండలం, మజ్జిపేట జెడ్‌పి హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఎం.అప్పలరాజును బుధవారం కొత్తపేట, తగరపువలసకు చెందిన పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. యుజిసి నిర్వహించిన 2023-24 యుజిసి నెట్ ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు గాను 234 మార్కులు సాధించి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు స్థానంలో నిలిచారు.అప్పలరాజును సహచర ఉపాధ్యాయులు, మిత్రులు, ఫర్ యువర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

వైసిపి బహిరంగసభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ సంగివలసలో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో, ఈ నెల 27న నిర్వహించనున్న వైసిపి ప్రాంతీయ సమావేశం, బహిరంగసభ ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్రమంత్రి గుడివాడ అమర్ నాథ్, వైసిపిఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయ కర్త వైవి సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే ఈ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు. కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సభలో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నట్లు ప్రకటించారు. వేదిక, ప్రాంగణం, హెలీపాడ్, పార్కింగ్ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అధికారులతో చర్చించారు



స్థల పరిశీలన చేస్తున్న మంత్రి అమర్, వైవి.సుబ్బారెడ్డి